క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే తాతయ్య



జగ్గయ్యపేట అర్బన్: జిల్లా కలెక్టర్ జి.సృజనను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) బుధవారం విజయవాడలోని కలెక్టర్ క్యాంపుకార్యాలయంలో కలిసి మాట్లాడారు. వత్సవాయి మండలం పోలంపల్లి డ్యాం వద్ద మునేరుకు తాత్కాలిక మరమ్మతుల విషయమై కలెక్టర్‌ను కలిసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మునేరు మరమ్మతులపై జిల్లా కలెక్టర్ ద్వారా ఖమ్మం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడించినట్లు వివరించారు. ఈనెల 6వ తేదీన రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలువనున్నందును ఈలోగా మునేటి సమస్య లేకుండా చూడాలని కలెక్టర్ సృజన కోరగా, ఖమ్మంజిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఈసమస్యను పరిష్కరిస్తామని హామీఇచ్చినట్లు ఎమ్మెల్యే వివరించారు.

వైఎస్సార్ విగ్రహం పాక్షికంగా ధ్వంసం



వెంకటాపురం(పెనుగంచిప్రోలు): టీడీపీ కార్యకర్తల దాడిలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం పాక్షికంగా ధ్వంసమైన ఘటన పెనుగంచిప్రోలు మండలంలోని వెంకటాపురం గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంపై కర్రలతో దాడిచేయడంతో విగ్రహం పాక్షికంగా దెబ్బతింది. అదేవిధంగా కె.పొన్నవరం వెళ్లే రోడ్డులోని ఆర్చిపై ఉన్న సామినేని ఉదయభాను మోడల్‌కాలనీ అనే పేరుపై అదేగ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు రంగులు పూశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకుని తిరిగి పేర్లు రాయించారు. వెంకటాపురంలో ఎటువంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. విగ్రహానికి మరమ్మతులు చేశారు.

ఆనకట్ట గండ్లను వెంటనే పూడ్చాలని డిమాండ్



పోలంపల్లి(వత్సవాయి): పోలంపల్లి ఆనకట్టకు పడిన గండ్లను రాష్ట్రప్రభుత్వం వెంటనే పూడ్చాలని సీపీఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు బుధవారం పోలంపల్లి ఆనకట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెక్‌డ్యాంకు పడిన గండ్లను వెంటనే పూడ్చి రైతులకు సాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ ఆనకట్ట పరిధిలోని వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ మండలాలకు చెందిన సుమారు 20వేల ఎకరాలు సాగు భూమి ఉందన్నారు. ఈ భూములలో వరితో పాటు పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలను సాగుచేస్తారన్నారు. త్వరితగతిన గండ్లను పూడ్చి పంటలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. వ్యవసాయ పనుల ప్రారంభదశలోనే ఈ పనులను ప్రారంభించాలని వారు రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల పార్టీ కార్యదర్శి తమ్మినేని రమేష్, రైతుసంఘం నాయకులు తమ్మినేని రాంబాబు, మండేపుడి చంద్రశేఖర్, కంచర్ల కొండయ్య, మల్లికార్జునరావు, యాదగిరి, గూటి నాగయ్య పాల్గొన్నారు.

13న ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన స్కీమ్‌పై వర్క్ షాప్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఈనెల 13వ తేదీ శనివారం ఎంఎస్‌ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన స్కీమ్‌పై ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ దాసరి దేవరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్క్‌షాప్ చాంబర్ డెవలప్‌మెంట్ అధికారి ప్రభ పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. వర్క్ షాప్‌లో కుటీర పరిశ్రమలు, వడ్రంగి, పడవల తయారీ, కమ్మరి, స్వర్ణకారులు, కుమ్మరి, శిల్పకారులు, చెప్పులు కుట్టే వారు, తాపీ పని చేసేవారు, బుట్ట/చాప/చీపుర్లు నేసేవారు, బొమ్మల తయారీ దారులు, క్షురకులు, రజకులు, దర్జీలు, చేపల వల తయారీ దారులకు రూ.1 లక్ష నుంచి 3 లక్షల వరకు రుణ సౌకర్యం బ్యాంకుల నుంచి మద్దతు, డాక్యుమెంటేషన్, మార్కెటింగ్ మద్దతు అందిస్తామన్నారు. ఆసక్తి కలిగిన విశ్వకర్మ యోజన వ్యాపారులు వర్క్ షాప్‌లో పాల్గొనటానికి నోరీ హాస్పిటల్ సమీపంలోని ఎంఎస్‌ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యాలయంలో స్వయంగా కానీ, 89197 37517, 63059 41717 ఫోన్ నంబర్‌లలో కాని తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రమాదకరంగా రోడ్డు మలుపులు

వీరులపాడు: మండలంలోని ఆయా గ్రామాల పరిధిలోని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారులపై ఉన్న మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. మండలంలోని నరసింహారావుపాలెం, జగన్నాథపురం, జుజ్జూరు, అల్లూరు గ్రామాల్లోని ప్రధాన రహదారులపై ఉన్న మలుపులు తరచూ ప్రమాదాలకు నెలవుగా మారాయి. ప్రమాదకర మలుపులు ఉన్నచోట సూచిక బోర్డులు కూడా లేకపోవడంతో వాహనచోదకులకు సరైన అవగాహన లేక ప్రమాదాల బారినపడుతున్నారు. మండలంలోని మెజార్టీ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీస్ సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు ద్విచక్ర వాహనాలు, ఆటోల ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. ఆటోల్లో సైతం నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కిస్తూ ప్రయాణాలు సాగిస్తుండటంతో ఇటువంటి మూలమలుపుల వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఏటా వందలాది గాయపడుతున్నారు. ఆయా మూలమలుపుల్లో వాహనాలు దగ్గరకు వచ్చేవరకు కూడా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోతుండటంతో



ప్రమాదకరంగా ఉన్న నరసింహారావుపాలెం సమీపంలోని తోటమూల

ప్రమాదాలు జరగడానికి ప్రధాన కారణమని చెప్పవచ్చు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా మూలమలుపుల వద్ద సూచికల బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.



జగన్నాథపురం సమీపంలోని మలుపు



జుజ్జూరులోని ప్రమాదకరంగా దర్శనమిస్తున్న మూలమలుపు



అల్లూరులోని మలుపు

టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలి

మాజీ విప్ ఉదయభాను



పోలీస్ కమిషనర్ రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ విప్ సామినేని ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల దౌర్జన్యకాండ రోజురోజుకు శృతిమించుతోందని మాజీ విప్ సామినేని ఉదయభాను అన్నారు. దాడులకు పాల్పడుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఆయన విజయవాడ పోలీసు కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ వత్సవాయిలో పార్టీ కార్యాలయంపై దాడి, పోలంపల్లిలో మాజీ సర్పంచి కాటేపల్లి రామయ్య విగ్రహ ధ్వంసం, ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనుల శిలాఫలకాలను టీడీపీ మూకలు ధ్వంసం చేశాయన్నారు. అనిగండ్లపాడు సర్పంచి జ్యోతిబ్రహ్మం ఇంటిపై మూకుమ్మడిగా దాడిచేసి ఆయనను గాయపరిచారన్నారు. పేట మండలంలోని చిల్లకల్లులో రామిశెట్టి రామారావు హోటల్ ధ్వంసం చేయడంతో పాటు జగ్గయ్యపేటలోని పాటి సాంబశివరావు ఇంటిపై దాడి చేసి ఏసీ, ఎల్‌ఈడీ టీవీ, వాషింగ్ మెషిన్ ధ్వంసం చేశారన్నారు. బీరువా పగులగొట్టి బంగారు నగలు, డబ్బులు చోరీ చేశారని వివరించారు. విద్యానగర్ కాలనీలో షేక్ ఆసిఫ్ తల్లిపై కారం చల్లి విచక్షణ రహితంగా దాడిచేశారన్నారు. పెనుగంచిప్రోలు మండలంలోని నవాబుపేట, వత్సవాయి మండలంలోని ఇందుగుపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, వారి ఇళ్లపై టీడీపీ నాయకులు దాడులకు పాల్పడ్డారని గుర్తుచేశారు. ఇంత జరుగుతున్నా టీడీపీ అధినాయకత్వం వాటిపై నోరుమెదపకుండా ఉండటం ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న దాడులను నిలిపివేయాలని, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉదయభాను డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఉదయభాను కోరారు.

దిష్టిబొమ్మ దగ్ధం

నందిగామ: నందిగామ పట్టణంలో బీజేపీ నాయకులు బుధవారం కేంద్ర ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ తుర్లికొండ సీతారామయ్య మాట్లాడుతూ రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు ప్రజలను కించపరిచేలా ఉన్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేదార్నాథ్ శర్మ, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, సాంబశివరావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్టాండ్ వద్ద సీపీఎం ధర్నా

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు సరైన మౌలికవసతులు కల్పించాలని పేట మండల సీపీఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను సీపీఎం నాయకులు బుధవారం సందర్శించారు. ప్రయాణికులకు అందించే మంచినీటి కొళాయిలు, వాటర్ ట్యాంకులను పరిశీలించారు. అనంతరం ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ బస్టాండ్ అవుట్ గేట్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ప్రయాణికులకు పరిశుభ్రమైన మంచినీరు అందించాలని, వాటర్ ట్యాంకు, కొళాయిలను మార్చాలని నినాదాలు చేశారు. మరుగుదొడ్డి వాడకంపై ప్రయాణికుల నుంచి అధికమొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. డిపో మేనేజర్ వెంటనే స్పందించి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఎం సీనియర్ నాయకులు కాకనబోయిన లింగారావు మాట్లాడుతూ పేట ప్రాంతంలో బస్టాండ్‌లో అపరిశుభ్రమైన, కలుషితమైన నీటిని అందిస్తూ ప్రజల ప్రాణాలతో ఆర్టీసీవారు చెలగాటమాడుతున్నారని విమర్శించారు. డయేరియాతో ఇప్పటికే ఆరుగురు మృతిచెందారని, వందలాది మంది డయేరియా బారినపడ్డారని గుర్తుచేశారు. అనంతరం కొద్దిసేపటికి డిపో మేనేజర్ రఘురాం సంఘటనాస్థలానికి



పేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

చేరుకుని సీపీఎం నాయకులతో చర్చించగా, ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. త్వరలో బస్టాండ్‌లో వాటర్ ట్యాంక్, కొళాయిలు మారుస్తామని డీఎం తెలిపారు. ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు మరుగుదొడ్ల వాడకంపై నిర్దేశించిన రూ.5 మాత్రమే వసూలు చేసేలా తగిన చర్యలు చేపడతామని డీఎం హామీ ఇచ్చారు. డీఎం హామీతో సీపీఎం నాయకులు తమ ఆందోళనను విరమించారు. ధర్నాలో సీపీఎం పేట పట్టణ, మండల కార్యదర్శి సోమోజు నాగమణి, నాయకులు కోట కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, గౌస్‌మియా, బాలు, రాంప్రసాద్, శేషు, బూషమ్మ, రామనాధం పాల్గొన్నారు.

జాతీయ ఉపాధ్యాయ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఆన్‌లైన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు తెలిపారు. కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు అందించే జాతీయ పురస్కారం – 2024కు ఉపాధ్యాయులు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పదేళ్ల సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ విధానంలో ఉపాధ్యాయులు స్వయంగా తమ నామినేషన్‌ను నేషనల్ అవార్డ్స్ టూ టీచర్స్ అనే వెబ్‌సైట్ ద్వారా ఈనెల 15వతేదీలోగా సమర్పించాలని ఆ ప్రకటనలో ఆయన సూచించారు.

ప్రైవేట్ స్కూళ్లలో నిబంధనలు పాటించాలి

నందిగామ: ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పాఠశాలలను నడిపి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. పట్టణంలోని ఓసి క్లబ్‌లో నందిగామ, తిరువూరు డివిజన్ పరిధిలోని ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులతో విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్నివసతులు తప్పనిసరిగా కల్పించాలని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ విద్యార్థులకు మంచివిద్యను అందించాలన్నారు. ముఖ్యంగా అధికఫీజులు వసూలు చేసి విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందిపెట్టవద్దన్నారు. అనంతరం జిల్లా



మాట్లాడుతున్న నందిగామ ఎమ్మెల్యే సౌమ్య

విద్యాశాఖ అధికారి యు.వి.సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాలను ప్రైవేటు పాఠశాలల నిర్వహకులు తప్పనిసరిగా పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. అనంతరం సంబంధిత పాఠశాలల నిర్వహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీవైఈవో ఎం. వెంకటప్పయ్య, రెండు డివిజన్ల పరిధిలోని ఎంఈఓలు, పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

కొత్తగా రెండు డయేరియా కేసులు



పేట ప్రభుత్వాస్పత్రిలో పేషంట్లను పరామర్శిస్తున్న ఏడీఎంహెచ్‌వో ఉషారాణి



షేర్‌మహ్మద్‌పేటలో బావిలోకి వచ్చే చెరువు నీటిని డమ్మీచేస్తున్న పంచాయతీ ఉద్యోగి

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని డాంగేనగర్‌కు చెందిన ఓవ్యక్తి, మండలంలోని షేర్‌మహ్మద్‌పేట నుంచి మరోవ్యక్తి డయేరియాతో బాధపడుతూ బుధవారం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో చేరారు. ప్రభుత్వాసుపత్రి నుంచి నలుగురు వ్యక్తులు డిశ్చార్జి కాగా, ప్రస్తుతం ఆరుగురు వ్యక్తులు చికిత్స పొందుతున్నారు. చికిత్సపొందుతున్నవారిలో బూదవాడ, తొర్రగుంటపాలెం, వత్సవాయి, రామచంద్రునిపేట గ్రామాలకు చెందినవారు ఉన్నారు. చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని తెలిపారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జగ్గయ్యపేట ప్రాంతంలో డయేరియా ఉద్ధృతి తగ్గిపోయిందన్నారు. ఈవారం చివరినాటికి మిగిలిన రోగులకు పూర్తిగా కోలుకుని డిశ్చార్జి అవుతారని ఆశిస్తున్నామన్నారు. ఎవరైనా వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఉంటే వెంటనే జగ్గయ్యపేటప్రభుత్వాస్పత్రిలో చేరాలని సూచించారు. డయేరియా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తుండటంతోపాటు రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాల సమన్వయంతో డయేరియా నివారణ చర్యలు చేపట్టామని వివరించారు. షేర్‌మహ్మద్‌పేట, చిల్లకల్లు, మక్కపేటలో వైద్యశిబిరాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

ఏడీఎంహెచ్‌వో సందర్శన..

పేట ప్రభుత్వాస్పత్రిని అడిషనల్ డీఎంహెచ్‌వో ఉషారాణి సందర్శించారు. డయేరియాతో బాధపడుతున్న పేషంట్లను ఆమె పరామర్శించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి రోగులకు అందిస్తున్న చికిత్సలను అడిగితెలుసుకుని, సిబ్బందికి పలుసూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ షేర్‌మహ్మద్‌పేటలో కలుషితమైన నీటికి కారణమైన బావికి చెరువు నుంచి వచ్చే నీటిని డమ్మీ చేసినట్లు తెలిపారు. ఆమె వెంట పీపీ యూనిట్ వైద్యులు నాగరాణి, వాసంతి బూచవరం వైద్యాధికారులు అనిల్‌కుమార్, స్రవంతి, సబ్‌యూనిట్ అధికారులు, పంచాయతీ, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

డయేరియాను అరికట్టాలని వినతి

జగ్గయ్యపేట అర్బన్: డయేరియాను అరికట్టేందుకు తక్షణమే జగ్గయ్యపేట ప్రాంతంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, తద్వారా ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీఎం పార్టీ జగ్గయ్యపేట పట్టణ, మండల కార్యదర్శి సోమోజు నాగమణి రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో డయేరియాతో చికిత్స పొందుతున్న పేషంట్లను సీపీఎం నాయకులు బుధవారం పరామర్శించారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసినితో మాట్లాడి డయేరియా పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆపార్టీ మండల కార్యదర్శి సోమోజు నాగమణి మాట్లాడుతూ పేట పట్టణంతో పాటు గ్రామాల్లోని తాగు నీటి పైపులైన్లు శిథిలావస్థలో ఉన్నాయని, ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీకి నిధులు కేటాయించి నూతన పైపులైన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



తహశీల్దార్ శేషగిరికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కృష్ణానది జలాలను శుద్ధి చేసి నియోజకవర్గంలోని అన్నిగ్రామాలకు ఇవ్వాలని కోరారు. అనంతరం డయేరియాను అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతూ పేట తహసీల్దార్ శేషగిరిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎం పార్టీ నాయకులు కోట కృష్ణ, కె.లింగారావు, దంతాల వెంకటేశ్వర్లు, షేక్ గౌస్‌మియా, రామనాధం, బాలు, రాంప్రసాద్, రావెళ్ల శేషు, బూచమ్మ పాల్గొన్నారు.

బీరసాగుకు రైతుల మొగ్గు

- తక్కువ పెట్టుబడి.. అధిక లాభాలు
- మూడు నెలల్లో దిగుబడి



ముచ్చింతాలలో సాగవుతున్న బీర తోట

పెనుగంచిప్రోలు: సంప్రదాయ పంటల సాగుకు భిన్నంగా ఆయాగ్రామాల రైతన్నలు ఉద్యానవన పంటలైన కూరగాయల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. అధిక మొత్తంలో పెట్టుబడి వెచ్చించి మిర్చి, పత్తిసాగు చేసి ఒక్కోసారి ప్రకృతి ప్రకోపానికి గురై తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో పెట్టుబడి, సాగునీరు పెద్దగా అవసరం ఉండని కూరగాయల సాగుకు రైతులు ప్రస్తుతం బాగా మొగ్గుచూపుతున్నారు. తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలు వచ్చే అవకాశం ఉండటం కూరగాయల సాగుపై రైతుల మక్కువకు ప్రధాన కారణమని చెప్పవచ్చు.

100ఎకరాల్లో బీర సాగు..

పెనుగంచిప్రోలు మండలంలోని పలు గ్రామాలతోపాటు నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లో రైతులు సుమారు 100ఎకరాల్లో బీర సాగు చేపట్టారు. బీర కోతలు కూడా కోస్తున్నారు. ధర కూడా మార్కెట్‌లో ఆశాజనకంగా ఉంది. ఎకరానికి రైతులు రూ.20 నుంచి రూ.25 వేల పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో బీర రూ.50 నుంచి రూ.60 వరకు పలుకుతోంది. రైతులకు కూరగాయల సాగుతో ధర బాగుంటే పెట్టుబడి పోను ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.40 వేలు వరకు మిగులుతున్నాయి. పంట కూడా మూడు నెలల్లోనే వస్తుందని రైతులు చెబుతున్నారు. పండించిన పంటను స్థానికంగా విక్రయించడంతోపాటు జగ్గయ్యపేట, నందిగామ రైతుబజార్‌లు, పెనుగంచిప్రోలు దుకాణాలకు తరలించి స్వయంగా అమ్మకాలు సాగిస్తుండటంతో గిట్టుబాటు ధర లభిస్తోందని రైతులు చెబుతున్నారు.

నీటి వినియోగం తక్కువ...

నీటి ఎద్దడి ఉన్న ఈరోజుల్లో తక్కువ నీటి వినియోగం ఉన్న కూరగాయల సాగు బాగుంటుందని రైతులు అంటున్నారు. పంటకాలం, పెట్టుబడి తక్కువగా ఉండటంతో ప్రస్తుత పరిస్థితుల్లో కూరగాయల సాగు లాభదాయకంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.



బీరకాయలను మార్కెట్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్న రైతులు

రాయితీపై విత్తనాలు..



కూరగాయల సాగుకు ఉద్యానవన శాఖ ద్వారా రాయితీపై విత్తనాలు అందజేస్తాం. కూరగాయల సాగు సీజనల్‌గా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రకృతి అనుకూలిస్తే చాలా లాభసాటిగా ఉంటుంది. తీగజాతి కూరగాయల సాగుకు పందిళ్లకు కూడా ప్రభుత్వ సహకారం ఉంటుంది. అంతర పంటగా సాగు చేసుకుంటే రైతుకు అదనపు ఆదాయం లభిస్తుంది.

–కె.రామసుబ్బారెడ్డి, ఏవో

8ఎకరాల్లో బీరసాగు చేపట్టా..



పండించిన పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఉంటే రైతులకు కూరగాయల సాగు బాగుంటుంది. ముచ్చింతాల వద్ద 8ఎకరాలు బీర, 4 ఎకరాల్లో దోస సాగు చేశాను. ప్రస్తుతం బీరకాయలు కోతలు కోస్తున్నాం. ఇటీవల వరకు మార్కెట్‌లో బీర కిలో రూ.60 నుంచి రూ.70 వరకు కొనుగోలు చేశారు. ప్రస్తుతం కిలో రూ.50 పైనే ఉంది. అరటిలో అంతర పంటగా కూరగాయలు సాగు చేస్తున్నాను.

– కె.రవి, రైతు

కృషి విజ్ఞాన కేంద్రం సందర్శన



గరికపాడు(జగ్గయ్యపేట): రైతులకు కేవీకే శాస్త్రవేత్తలు నిత్యం అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు అందించాలని ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు ప్రమీలారాణి సూచించారు. గరికపాడులోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)ను బుధవారం ఆమె సందర్శించారు. వ్యవసాయ క్షేత్రంలో వినియోగిస్తున్న యంత్ర పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రమీలారాణి మాట్లాడుతూ శాస్త్రవేత్తలు రైతులకు విత్తనాల కొనుగోలు నుంచి దిగుబడి వరకు సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. వ్యవసాయ క్షేత్రానికి రైతులను తీసుకువచ్చి క్షేత్రస్థాయిలో పంటలసాగుపై వారికి అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా భూసార పరీక్షలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, యంత్ర పరికరాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కేవీకే శాస్త్రవేత్తలకు ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప విస్తరణ సంచాలకుడు ముకుందరావు, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృష్ణంరాజు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.